## క్లుప్తంగా

### జమలాపురంలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న అధికారులు, అర్చకులు

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆలయ ఆవరణలో మామిడి, రావి, ఉసిరి, వేప, మారేడు మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పమ్మిలో..**
**ముదిగొండ:** మండలపరిధిలోని పమ్మిలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బాస్కర్, ఎంపీఓ వాల్మీకి కిషోర్‌లు గ్రామపంచాయతీ కార్యాలయం, హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్‌ఎం హరిప్రసాద్, పమ్మి పంచాయతీ కార్యదర్శి రాధిక, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### రామాలయంలో ప్రత్యేక పూజలు

**చింతకాని:** మండలంలోని తిమ్మినేనిపాలెం కోదండ రామాలయంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి హర్షవర్ధనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు బుచ్చిబాబు, వెంకటేశ్వర్లు, ఫరీద్‌బాబు, సురేష్, హనుమంతురావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



అఖిలపక్ష సమావేశంలో నాయకులు

**మధిర:** ఈ నెల 9న నిర్వహించనున్న కార్మికుల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు తెలిపారు. మధిరలోని బోడేపూడి భవన్ నందు సీపీఐ నాయకుడు బెడవాడ రవిబాబు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ నెల 7న 200 మోటార్ సైకిళ్లతో భారీ బైక్ ర్యాలీ, 9వ తేదీన కార్మికులతో భారీ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు రమణ గుప్తా, నర్సింహారావు, రాణి, హనుమంతురావు, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘం నాయకులు సైదులు, పుల్లయ్య, కొండలరావు, రహీం, మురళి, ప్రకాశ్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చాలి

**పెనుబల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వీయంబంజర్ జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రామారావు, శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ మేనేజర్‌కు సన్మానం



మేనేజర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న పెన్షనర్లు

**వైరా:** వైరా ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన మేనేజర్ వెంకటరెడ్డిని వైరా పెన్షనర్లు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, మండల బాధ్యుడు సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, సుబ్బయ్య, కృష్ణారావు మాట్లాడారు. పెన్షనర్ల పట్ల అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. పెన్షనర్‌లు వలీజాన్, వెంకటేశ్వరరావు, పుల్లారావు, పిచ్చిరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

### సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

**కొణిజర్ల:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ డి.బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని గుబ్బగుర్తిలో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి పంటలో నీరు నిలవకుండా బయటకు పంపాలని, లేకుంటే సిలీంద్ర వ్యాధి వేర్లకు సోకి కుళ్లిపోతాయని, ఒక్క మొక్కకు వచ్చినా చేను మొత్తం సోకుతుందన్నారు. ఈ వ్యాధి కనిపిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా కార్బెండిజమ్ మ్యాంకోజోల్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు కుమ్మరి నాగేశ్వరరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో..

# వీయం బంజర్ బస్టాండ్



వీయం బంజర్ ఆర్టీసీ బస్టాండ్

- కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం
- దుర్గంధం నడుమే రాకపోకలు

**పెనుబల్లి:** వీయం బంజర్ బస్టాండ్‌లో సమస్యలు తిష్ట వేశాయి. బస్టాండ్‌కు సువిశాలమైన రెండు ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయాణికులకు అవసరమైన కనీస వసతులు కల్పించడంలో ఆర్టీసీ సంస్థ విఫలమైంది. రాష్ట్రంలోనే రెండు ప్రధాన జాతీయ రహదారులైన విజయవాడ - భద్రాచలం, హైదరాబాద్ - విశాఖపట్నం లకు కూడలిగా ఉన్న వీయంబంజర్ బస్టాండ్‌కు నిత్యం సత్తుపల్లి, ఖమ్మం, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, భద్రాచలం, తిరుపతి వంటి సుదీర్ఘ ప్రాంతాలకు వందలమంది ప్రయాణికులను ఈ బస్టాండ్ గుండానే బస్సుల చేరవేస్తుంటాయి. అయినా కనీస వసతులు కల్పించడంలో ఆర్టీసీ విఫలమైందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**ప్రయాణికుల ఇబ్బందులు..**
బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ అధికారులు కనీస వసతులు కల్పించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వెళ్లే పట్టిక ఏర్పాటు చేయకపోవడంతో బస్సులు ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మూత్రశాలలు సరిగ్గా లేక, ఉన్నవైన పనిచేయకపోవడంతో పలువురు పురుషులు బస్టాండ్ ఆవరణలోని ఖాళీప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ మొత్త కంపు కొడుతుంది, దీంతో ప్రజలు ముక్కు మూసుకుని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఏర్పాటు చేయని సీసీలు..**
ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బస్టాండ్‌లో సీసీలు ఏర్పాటు చేయాలి, కానీ అటువంటి దాఖలాలు లేవు. దీంతో ప్రయాణికుల సామగ్రి, ఫోన్లు, చోరీలు జరుగుతున్నాయి. వర్షాకాలం బస్టాండ్ ఆవరణలో వచ్చే ప్రయాణికులకు అనుగుణంగా వర్షానికి తడవకుండా తగిన ఏర్పాట్లు కూడా లేవు. వేసవిలో స్థానిక పంచాయతీలు, దాతల సాయంతో తాగునీరు ఏర్పాటు చేస్తున్నప్పటికీ మిగతా సమయాల్లో కొనుగోలు నీరు కొనుగోలు చేయక తప్పడం లేదు. కనీసం బస్టాండ్‌కు వచ్చే ఇన్ గేట్, అవుట్ గేట్ మార్గాల్లో సూచికల బోర్డులు లేకపోవడంతో బస్టాండ్‌లోకి బస్సులు వచ్చి వెళ్లే సమయాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

**బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి..**



వీయంబంజర్ బస్టాండ్‌కు 2 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో ఆర్టీసీ సంస్థ తగిన ఏర్పాటు చేయడంతో పాటు, దూర ప్రాంత ప్రయాణికులు సేదతీరడానికి వసతులు కల్పించాలి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఈ బస్టాండ్‌లో అందమైన మొక్కలతో పార్క్‌ను ఏర్పాటు చేసి, బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి.
– మేకతొట్టి కాంతయ్య, వీయం బంజర్

**ఇబ్బందిగా ఉంది..**
బస్టాండ్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటిది బస్టాండ్ ఆవరణలోనే పలువురు మూత్ర విసర్జన చేయడంతో.. ఆవరణ మొత్తం దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ప్రయాణికులు, ముక్కు మూసుకుని ఉంటున్నారు. మూత్రశాలలు ఏర్పాట చేస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుంది.
– శిరసాని చెన్నారావు, మాజీ వార్డు మెంబర్, వీయం బంజర్

# కారేపల్లిలో బస్‌షెల్టర్ లేక అవస్థలు



రోడ్డుపైనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు



బస్టాండ్ సెంటర్‌లో..

**కారేపల్లి:** కారేపల్లిలో బస్‌షెల్టర్ లేక.. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి బస్ కోసం రోడ్లపైన నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎండయినా, వానయినా..సరే! ప్రయాణికులకు మాత్రం ఈ తిప్పలు తప్పట్లేదు. బస్ రాగానే.. రోడ్ల పైన్నే బస్సు ఎక్కేందుకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చింది. ఎటు వైపు నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొట్టుతుందోననే.. భయాందోళనల నడుమ బస్సు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన కారేపల్లికి.. ఖమ్మం, ఇల్లెందు, డోర్నకల్, మాధారం లనుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా కారేపల్లి నుంచి గేటుకారేపల్లి, కారేపల్లి క్రాస్‌రోడ్డు, పేరుపల్లి గ్రామాలకు ఆటోల్లో చేరుకోవాలన్నా ఈ సెంటరే దిక్కు. దీంతో బస్టాండ్ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. మూలమలుపులతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం.

**గంటల తరబడి నిరీక్షణ..**
కారేపల్లి బస్టాండ్ నుంచి ప్రయాణికులతో పాటుగా విద్యార్థులు, కార్మికులు, వైద్యనిమిత్తం పలువురు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు సర్వీసులు అంతంత మాత్రంగా ఉండడంతో పై వారంతా బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. బస్సుషెల్టర్ లేకపోవటంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఉండాలి. లేకపోతే రోడ్డు పక్కన ఉన్న దుకాణాల షెడ్లకిందకు వెళ్లి నిరీక్షించాల్సి వస్తుంది.

**ప్రభుత్వ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మించాలి..**



కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 38లో ఇదివరకే.. ప్రజామరుగుదొడ్లు నిర్మించారు. దీని పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో బస్టాండ్ సెంటర్ మెయిన్ రోడ్డుకు ఆనుకొని బస్‌షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది. ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉంటారు. దీనికితోడు, మరుగుదొడ్లు సైతం ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించి, బస్‌షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించడం జరిగింది.
– ఇందుర్తి సురేందర్‌రెడ్డి, కారేపల్లి

# కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించండి



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లిటౌన్:** రానున్న మున్సిపల్, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలని ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. మున్సిపాలిటీకి అదనంగా మరో 150 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టా దయానంద్, దోమ ఆనంద్, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, చల్లగుల్ల నర్సింహారావు, పింగళి, సామేల్, రాము, అలవాల కరుణాకర్ పాల్గొన్నారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం..**
**ఏన్కూరు:** పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని తూతకలింగన్నపేటలో బుధవారం 48మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలి, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రణాళికలు

**ఎర్రుపాలెం/బోనకల్:** మధిర మార్కెట్ పరిధి ఎర్రుపాలెం, బోనకల్‌లోని యార్డుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించామని చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. ఎర్రుపాలెం, బోనకల్‌లోని యార్డులను బుధవారం పరిశీలించిన ఆయన ఇంజనీరింగ్ అధికారులతో వసతుల కల్పన, అభివృద్ధిపై చర్చించారు. అవసరం మేరకు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రహరీ, ప్లాట్‌ఫాంలు నిర్మించనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ డీఈఈ ఎల్లేష్, కార్యదర్శి చంద్రశేఖర్, డైరెక్టర్లు అనుమోలు వెంకటేష్, వట్టికొండ రామకృష్ణతో పాటు నాయకులు కడియం శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, షేక్ ఇస్మాయిల్, మొగిలి అప్పారావు, కంచర్ల వెంకటనర్సయ్య, జానీబాషా, దేవరకొండ రాజీవ్‌గాంధీ, రవి, నారాయణ, పైడిపల్లి కిషోర్‌కుమార్, గాలి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న చైర్మన్ నర్సింహారావు

## సంక్షిప్త సమాచారం

**కమ్యూనిస్టులతోనే దేశ పురోగతి**
**బోనకల్:** కమ్యూనిస్టులతోనే భారత దేశ పురోగతి, అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. లిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన కామ్రేడ్ కిలారు తిరుపతయ్య మూడో వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యలపై తిరుపతయ్య రాజీలేని పోరాటాలు చేశారని కొనియాడారు. సీతారామ ప్రాజెక్ట్ నీటిని పాలేరులో కలపడం ద్వారానే నియోజకవర్గంలోని భూములకు నీటి సమస్య తీరుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, కోటేశ్వరావు, గోపాలరావు, సురేష్, నాగేశ్వరరావు, రామనర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

**అనుమతులు ఇవ్వాలి**
**వైరా:** ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వైరా మున్సిపాలిటీ గండగలపాడు నుంచి వైరా నది వైపు, సోమవరం వైపు రైతులు రాకపోకలు సాగించడానికి అనుమతులు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు రామారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రవి, మురళి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌ఐవీ నివారణపై అవగాహన**
**సత్తుపల్లిరూరల్:** స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ వారిచే రెడ్ రిబ్బన్‌క్లబ్–2025 ద్వారా 'ఒక రోజు రెడ్‌రిబ్బన్ సిర్ లీడర్స్ కన్వెన్షన్'ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నివారణ, వ్యాప్తి నిరోధక పోగ్రాం నిర్వహించడం జరిగింది. చీఫ్‌గెస్ట్ రిటైర్డ్ డీన్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.నర్సింహారావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ ఖమ్మం డీహెచ్ వీఎస్ సత్యకుమార్‌లు విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఏఐడీఎస్ వ్యాప్తి చెందకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కుమార్‌రాజా జయవరపు, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కళాశాల చైర్మన్ సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాంబశివరావు తదితరుల పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అవగాహన**
**మధిర:** మధిరలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో మధిర పోలీస్‌స్టేషన్ ఏఎస్సై లచ్చు బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార గోప్యత, ఫిషింగ్, మాల్వేర్ దాడులు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరగాళ్లు ఉపయోగించే అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకుండా ఉండటం, బలమైన పాస్‌వర్డ్ లను ఉపయోగించడం వంటి అంశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అంజన బాబు, డైరెక్టర్లు చందు, శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఏఐవైఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్**
**చింతకాని:** హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, మండల నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ చేసిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మహేష్, నాయకులు సత్యనారాయణ, కిషోర్, రమేష్ ఉన్నారు.

**సీపీఐ నాయకుడికి నివాళి..**
**చింతకాని:** మండలంలోని వందనం గ్రామానికి చెందిన సీపీఐ మండల నాయకుడు ఆవులు నాగరాజు(45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి గోపాలరావు, మండల కౌన్సిల్ సభ్యులు ఆది, మల్లేశ్వరరావు, వెంకన్న, నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

**మొహర్రం పండుగ వేడుకలు**
**కారేపల్లి:** పల్లెల్లో పీర్ల (మొహర్రం) పండుగ వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రజలు సాయంత్రం వేళలో పీర్ల ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ 'అసయ్‌దులా'అంటూ ఆడుతూ పాడుతూ సంబరాలు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళల్లో పీర్ల సవారీలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేస్తూ.. భక్తిపారవశ్యాన్ని చాటుతున్నారు. కార్యక్రమాల్లో షరీఫ్‌రంగా, భద్రియాదవ్, రమేష్, సలీమ్, గౌస్‌పాషా, మంగ్యానాయక్, రఘునాయక్, శోభన్‌లాల్, యాకూబ్ పాషా, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

### జానకీపురం హెచ్‌ఎంకు మెమో

**బోనకల్:** మండలంలోని జానకీపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌కుమార్‌కు గురువారం డీఈఓ సత్యనారాయణ మెమో జారీ చేశారు. పాఠశాలను అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం తనిఖీ చేయగా హెచ్‌ఎం విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నారని గుర్తించి శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. దీంతో ఆయనకు మెమో జారీ అయిందని ఎంఈఓ డి.పుల్లయ్య తెలిపారు.

### ఇంకుడుగుంత పరిశీలన

**ముదిగొండ:** మండలంలోని వల్లబిలోని ఓ ఇంటిలో నిర్మించిన ఇంకుడు గుంతను సీడబ్ల్యూసీ టీమ్ సభ్యుడు పృద్వీరాజ్, ఏపీడీ శ్రీదేవి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ గాలయ్య, ఈసీలు కిరణ్, వెంకటేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

### తహసీల్‌లో వీడియో కాన్ఫరెన్స్

**మధిర:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలకు ఇచ్చేటువంటి శిక్షణపై మధిర తహసీల్‌లో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కృష్ణయ్య



కృష్ణయ్య

**కారేపల్లి:** సింగరేణి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సంపత్‌కుమార్ కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సింగరేణి డీటీగా పనిచేస్తున్న కృష్ణయ్య.. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

### మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ



కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్లూరు:** మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రు లక్ష్మయ్య మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోట్రు ప్రవీణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్మికులు, విద్యుత్‌శాఖ కార్మికులు, 108,102 వాహనాల కార్మికులకు రూ.50 వేల విలువైన రెయిన్‌కోట్లను అందించారు. అదే విధంగా శాంతినగర్‌లోని కళాశీవాడ, ప్రాథమిక పాఠశాల, యూపీఎస్ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వాటర్‌బాటిళ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోట్రు కిరణ్‌కుమార్, కాటేపల్లి రజనీకాంత్, గద్దె నరేష్, ఏనుగుల అంజి, ఖమ్మంపాటి రమేష్, కొరకొప్పు ప్రసాద్, బసవయ్య, కొత్తపల్లి, వెంకటేశ్వర్లు, మేకల హనుమంతరావు, పోట్రు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మడుపల్లిలో ఫ్లెక్సీల ఏర్పాటు

**మధిర:** మండలంలోని మడుపల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫ్లెక్సీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఎన్నికల హామీల ప్రకారం రైతుల రుణమాఫీ కావడంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎడ తెరిపిలేని వర్షం

**తల్లాడ:** తల్లాడ మండలంలో బుధవారం తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. బిల్లుపాడు వద్ద వాగు, వెంగన్నపేట వద్ద కల్లూరు వాగు వర్షం కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వెంగన్నపేట - నూతనకల్ గ్రామాల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణంలో ఉన్నందున వాగు ఉధృతి వల్ల లో లెవల్ కాజ్‌వే వైపు రాకపోకలు రెండో రోజు కూడా స్తంభించిపోయింది. అలాగే బిల్లుపాడు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వెంగన్నపేట, బిల్లుపాడు వాగులను ఎంపీడీఓ సురేష్‌బాబు, తల్లాడ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణారావు, నూతనకల్, బిల్లుపాడు గ్రామ కార్యదర్శులు సాయి, రాంబాబు పరిశీలించారు. వర్షాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.



వెంగన్నపేటలో వాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శులు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఏన్కూరు:** వర్షాలతో వాగులు ప్రవహిస్తున్నందును ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు కోరారు. మండలంలోని జన్నారం నిమ్మవాగును బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పొంగే వాగుల్లోకి దిగి ప్రమాదాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీఎస్ నారాయణ, ఎస్‌ఐ రఫీ పాల్గొన్నారు.

**నిమ్మవాగుపై వంతెన నిర్మించాలి..**
మండలంలోని జన్నారం - ఆరికాయలపాడు మధ్య ఉన్న నిమ్మవాగుపై వంతెన నిర్మించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వంతెన మంజూరు చేయాలని కోరారు.



నిమ్మవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం



కమిషనర్ సంపత్‌కుమార్

**కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటిలోని కల్లూరు, తూర్పులోకవరం, పడమర లోకవరం, కిష్టయ్యబంజర, పుల్లయ్యబంజర, కప్పలబంధం, హనుమాతండా, వాచ్యానాయక్ తండా గ్రామాలను కలిపి 20 వార్డులుగా విభజించడం జరిగిందన్నారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలయిందన్నారు. బుధవారం నుంచి రికార్డు పరంగా ఉంటుందని, ఆయా కార్మికులు కల్లూరు మున్సిపల్ పరిధిలోకి వచ్చారన్నారు. 8 ట్రాక్టర్లు, 2 ఆటోల ద్వారా 47మంది కార్మికుల ద్వారా డంపింగ్ యార్డ్‌లకు చెత్తను తొలగించడం, డ్రెయినేజీల్లో పూడిక తీత, నీటి నిలువలు లేకుండా దోమల మందు, ఫాగింగ్ చేయించడం తదితర పారిశుద్ధ్య పనులు చేపించడం జరుగుతుందన్నారు. ఖాళీ స్థలాలు ఉన్న వారికి నోటీసులు పంపుతున్నామని, చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. కార్యక్రమంలో ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**జాగ్రత్తగా ఉండాలి..**
**పెనుబల్లి:** వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నారాయణమూర్తి అన్నారు. గత రెండు రోజులుగా వర్షపాతం 37.2 మిల్లీమీటర్లు నమోదు అయిందని, తడిసిన విద్యుత్ స్తంభాలు, రైతులు కరెంట్ మోటార్లు వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు, చెరువులు, శిథిలావస్థలో ఉన్న గృహాల సమీపంలోకి వెళ్లవద్దన్నారు. అలాగే వర్షాకాలం కారణంగా మంచినీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, శుభ్రపరిచిన నీరును మాత్రమే తాగాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ కిరణ్ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లంకాసాగర్ ప్రాజెక్టులోకి 240 క్యూసెక్కుల నీరు వాగులు ద్వారా వచ్చి చేరిందన్నారు.

## అటెన్షన్ ప్లీజ్

# ప్రమాదకరంగా ఎండిన చెట్లు



జమలాపురం - ఎర్రుపాలెం రహదారిపై ప్రమాదకరంగా ఉన్న చెట్లు

మండలంలోని జమలాపురం - ఎర్రుపాలెం ప్రధాన రహదారిపై బంజర గ్రామం వద్ద రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఎండిపోయిన చెట్లు ఉన్నాయి. కొందరు రైతులు చెత్త చెదారం, కంప చెట్లు తగలపెట్టే క్రమంలో ఈ చెట్లు కూడా తగలబడి ఎండిపోయాయి. ప్రస్తుతం పెనుగాలులతో కురుస్తునన వర్షాలకు వాహనదారులపై విరిగి పడే అవకాశాలున్నాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించి ఎండిపోయిన చెట్లను తొలగించాలని ఆదుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్,
ఏఈ, అర్‌అండ్‌బీ శాఖ అధికారి
సెల్ నంబర్ : 99123 40678